# విపశ్యన మాసపత్రిక

VOLUME : 2 NO - 10 1 JANUARY, 2008

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు – 70


## "ధర్మవాణి"

పతిరూపదేసవాసో చ,
పుబ్బే చ కతపుఞ్ఞతా ।
అత్తధమ్మాపణిధి చ,
ఏతం మఙ్గలముత్తమం ॥
.... మఙ్గలసుత్త –

ధర్మాచరణకు అనువైన స్థలంలో ఉండుట, పూర్వసంచిత పుణ్యకర్మలను కలిగి యుండుట, తనయందు తాను పూర్తిగ శాంతి కలిగియుండుట ఇదే ఉత్తమము, మంగళకరము.

## బుద్ధుని బోధనల యొక్క సార్వత్రిక లక్షణం - వ్యక్తిగత అనుభవము

### సత్యనారాయణ గోయంకా

(ఈ విషయము 10 డిశంబర్ 2004న యాంగూన్ మయన్మార్‌లో జరిగిన నాల్గవ ప్రపంచ బౌద్ధ శిఖరాగ్ర సమావేశంలో గోయంకా గారు ఇచ్చిన ప్రసంగం నుండి గ్రహింపబడినది.)

ఆత్యంత గౌరవప్రదమైన సంఘు మరియు ధర్మ మిత్రులారా,

దయతో నన్ను ఈ సమావేశమునకు ఆహ్వానించినందుకు, ముందు నన్ను సమావేశ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుకోనివ్వండి. శాంతియుతమైన బుద్ధుని యొక్క సందేశమును మొత్తం ప్రపంచమంతటా వ్యాపింప చేయుటకు బుద్ధుని అనుయాయులను ఐక్యపరిచేందుకు ఉద్దేశించబడిన నాలుగవ బుద్ధానుయాయుల సమావేశమును జరుపుటకు అథిధేయిగా మయన్మార్‌ను ఎన్నుకున్నందుకు కూడా నిర్వాహకులకు నా శుభాకాంక్షలు. మనం ఐక్యతతో సమిష్టి కృషి చేస్తున్నది ప్రపంచముమీద పెత్తనం చలాయించుటకు కాదు. ప్రపంచమును స్వార్థమునకు వినియోగించుకొనుటకు కాదు. ఒక మతము వేరొక మతము కంటే ఉన్నతమైనదని గొప్పలు చెప్పుకొనుటకు కాదు. కాని ఒక గొప్ప మానవజాతి పరివర్తనకు సహాయము చేయుటకు – బానిసత్వము నుండి స్వేచ్ఛకు పరివర్తన, క్రూరత్వము నుండి కరుణకు, భేదముల నుండి సామరస్యమునకు, దుఃఖము నుండి సుఖమునకు. ఇది బుద్ధుడు బోధించిన మార్గము. బుద్ధుడు శాంతి, సామరస్యముల సందేశమును వ్యాపింపజేశాడు. అశోక చక్రవర్తి దీనిని ఇంకా పలు ఇతర దేశాలకు విస్తరించాడు. ఈ రోజు ప్రపంచ బుద్ధానుయాయుల సమావేశము చాలామంది యొక్క లాభమునకై ఇదే దిశలో పనిచేయుటను చూచి నేను చాలా ఆనందపడుతున్నాను.

బుద్ధుడి యొక్క అనుయాయులలో చాలా విభజనలున్నట్లుగా కనిపించవచ్చు, కాని ఈ విభేదములన్ని పైపైవి మాత్రమే. ఈ శాఖలన్నీ ఒకే మౌలిక సూత్రములను అనుసరిస్తాయి. అవి చతురార్య సత్యములు, ఆర్య అష్టాంగ మార్గము, మరియు పటిచ్చ సముప్పాద. మయన్మార్‌లో ఈ సమావేశంలో ఈ కృషి ఒక నూతన ఉత్తేజాన్ని పొందడం నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తున్నది.

మయన్మార్ నా మాతృ భూమి. నేను ఇక్కడే పుట్టాను. నా కుటుంబం వలె కొన్ని కుటుంబాలలో ఒకరు పుట్టినటువంటి ఇంటి స్థలములో వారి బొడ్డు తాడును కప్పి పెట్టుట ఆచారము. ఇక్కడ ఈ మయన్మార్ మట్టిలో నాబొడ్డు తాడు కప్పిపెట్టబడింది. ఈ మయన్మార్ మట్టిలో నాలోని ఒక భాగము ఎల్లప్పుడూ ఉంటుంది. కేవలం నా ఒక భౌతిక దేహపు భాగము మయన్మార్ మట్టిలో ఉన్నందుకే ఇది నా మాతృభూమి కాదు. ఇది నా ఆధ్యాత్మిక మాతృభూమి కూడ. మయన్మార్ నాకు రెండు జన్మలనిచ్చింది. నేను ఇక్కడ ధర్మమును పొందడం వల్ల నాకు రెండవ జన్మ ఎక్కువ ముఖ్యమైనది. పక్షికి రెండు జన్మలున్నట్లుగా : ఒకటి తల్లి గర్భం నుండి బయటకు వచ్చుట, రెండవది గుడ్డు పెంకును బద్దలు కొట్టుకొని బయటకు వచ్చుట. ఆ విధంగా మా అమ్మ నాకు మొదటి జన్మనిచ్చింది మరియు సాయాజీ ఊ బా ఖిన్ నాకు రెండవ జన్మనిచ్చారు. నేను ధర్మాన్ని పొందాను. అజ్ఞానము అనే పెంకును బద్దలు కొట్టుకొని ఒక క్రొత్త గోయంకా బయటకు వచ్చాడు.

ఇది ఎంత శక్తివంతమైన ధర్మమంటే, బుద్ధుని బోధనలకు పూర్తి వ్యతిరేకతతో పెంచబడినప్పటికి ఈ సద్ధర్మమునకు నేను ఆకర్షించబడ్డాను. బుద్ధుని పూజించవచ్చు. కాని అతని బోధనలనుండి తప్పనిసరిగా దూరంగా ఉండాలని నాకు పదే పదే బాల్యంలోనూ, యౌవ్వనారంభములోనూ నూరిపోయడం జరిగింది. బుద్ధుని బోధనలు మోసగించేవి మరియు నరకమునకు తీసుకొని వెళ్ళేవని నాకు చెప్పారు.

అంత ప్రతికూలాభిప్రాయాలున్నప్పటికీ నేను ఏ విధంగా సద్ధర్మములోనికి రాగలిగాను? ఏది నన్ను బుద్ధ ధర్మమునకు ఆకర్షించింది?

నేను మొట్టమొదటిసారి నా ఆచార్యులు సాయాజి ఊ బా ఖిన్ గార్ని కలవడం నాకు గుర్తుంది. నేను నా నమ్మకాలతో చాలా గట్టి అనుబంధం కలిగి ఉన్నవాడిని. బుద్ధుని బోధనల గూర్చి నాకు చాలా అపోహలుండేవి. నేను స్థానిక భారతీయ హిందూ సమాజానికి నాయకుడనని సాయాజికి తెలుసు. ఆయన నన్ను అడిగారు. "శీల – నైతిక జీవనమునకు, సమాధి – మనస్సు పై ఆధిపత్యమునకు– పన్న (ప్రజ్ఞ), మనస్సును శుభ్రపరచు జ్ఞానమునకు మీ హిందువులకు ఏమైన అభ్యంతరమున్నదా?'

' నేను ఏవిధంగా అభ్యంతరము చెప్పగలను! ఎవరైన ఏవిధంగా అభ్యంతరము చెప్పగలరు? ఆయన కొనసాగించారు, "మరి ఇదే బుద్ధుడు బోధించింది. నేను ఆసక్తి చూపేది, మరియు నేను నీకు నేర్పేది ఇది మాత్రమే". శీల, సమాధి, ప్రజ్ఞలకు ఎవరికైన ఏమి అభ్యంతరం ఉంటుంది? తరువాత కాలములో నేను ధర్మమును నేర్పుట మొదలు పెట్టిన తరువాత, సయాజి ధర్మమును వివరించిన మాదిరిగానే, నేను కూడా వేరు వేరు మతాల నేపథ్యములతో వచ్చిన వారికి ధర్మాన్ని చెప్పేవాడిని.

సయాజి ధర్మ వివరణ సార్వజనీనము. అది శాఖా దురభిమానము లేనిది. నన్ను "బౌద్ధంలోనికి మార్చటంలో ఆయనకు ఆసక్తి లేదు.' ఆయన ఈ విధంగా అనేవారు, నా దృష్టిలో ఎవరైనా శీల, సమాధి, పన్నలను (ప్రజ్ఞ) అనుసరిస్తుంటే, వారు బుద్ధానుయాయుల క్రిందే లెక్క. మరియు ఒక బుద్ధానుయాయి శీల సమాధి ప్రజ్ఞలను ఆచరించకపోతే నేను వారి గురించి బాధపడతాను!"

నా మొదటి విపశ్యన శిబిరము నాకు బుద్ధుని బోధనలను పరిచయం చేసింది, మరియు నా జీవితాన్ని ఎల్లప్పటికీ పరివర్తన చెందించింది. ఆయన తార్కికమైన, ఆచరణీయమైన, సార్వజనీనమైన మరియు శాఖా దురభిమానములేని బోధనలు నన్ను అయస్కాంతంలా ఆకర్షించాయి. అందులో అభ్యంతరకరమైనదేదిలేదు. మలినాలను తొలగించుకొనుట మరియు మనసును పరిశుద్ధపరచుటలను గురించే నేను వింటూ ఉన్నాను మరియు మాట్లాడుతూ ఉన్నాను. నేను సంవేదనలను గమనించుట మొదలు పెట్టినపుడు, మొదట్లో కొన్ని క్షణాలు అనుమానించాను. "ఇది నాకు ఏ విధంగా సహాయపడుతుంది అని. కాని త్వరలోనే సంవేదనలను గమనించడం ద్వారా, సమస్య యొక్క మూలములో పనిచేస్తున్నానని తెలుసుకొన్నాను. నేను నిజానికి పరిపూర్ణ ముక్తి అనే గమ్యస్థానము వైపుకు నడుస్తున్నాను. అవి రెండు ముఖ్యమైనవి అయినప్పటికి, సయాజి నాకు బోధించినదంతా కేవలం భక్తిని పెంచుటకు లేక బుద్ధిని సంతృప్తి పరుచుటకు కాదు. సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొనే మార్గమును ఆయన నాకు నేర్పారు. నాకు నమ్మకం కలిగించింది ఏమిటంటే దేహ సంవేదనల ద్వారా సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవడమే. మరియు ఇది ఇక్కడే ఇప్పుడే ఫలితాలనిస్తుంది. నేను ఈ ధర్మభూమిపై పుట్టినందుకు చాలా అదృష్టంగా భావిస్తాను. సయాజి ఊబా ఖిన్ గారితో పరిచయం కలగటం నేను చాలా అదృష్టంగా భావిస్తాను. ఆయన ఈ విజ్ఞానమును దాని యొక్క ప్రాచీన, మౌలిక, పరిశుద్ధతతో కలిగిన వ్యక్తి. సయాజి తిరిగి దేనిని ఆశించకుండా అత్యంత కరుణతో బోధించిన సాధు సదాచారి.

ఇప్పుడు ఇదే బోధన ప్రపంచమంతటి నుండి ప్రజలను ఆకర్షిస్తూ ఉంది. విపశ్యన శిబిరాలు సుమారు 70 దేశాలలో నిర్వహించబడుతున్నాయి. మరియు 130 కంటే ఎక్కువ దేశాల నుండి ప్రజలు ఈ శిబిరాలలో పాల్గొంటున్నారు. ఎందుకు ప్రపంచమంతటి నుండి ప్రజలు బుద్ధధర్మం వైపుకు ఆకర్షించబడుతున్నారు? బుద్ధుని యొక్క బోధనలు చాలా సరళమైనవి మరియు చాలా లోతైనవి. ఆయన కొద్ది మాటలతో తన బోధనలను వివరించారు.

***సబ్బపాపస్స అకరణం, కుసలస్సఉపసంపదా***

***సచిత్త పరియోదపనం, ఏతం బుద్ధాన సాసనం.***

(దీఘనికాయ, II మహాపదానసుత్త)

***ఏతం బుద్ధాన సాసనం.*** ఇది బుద్ధులందరి బోధన, కేవలం గౌతమబుద్ధునిదే కాదు. బుద్ధులైన ప్రతి ఒక్కరు ఈ మూడింటిని మాత్రమే గాని వేరేమి బోధించరు. ***సబ్బపాపస్స అకరణం*** – అవినీతి పనుల నుండి, చెడు కార్యములు, పాపకార్యముల నుండి దూరంగా ఉండాలి. ***కుసలస్స ఉపసంపదా*** – నీతివంతములైను, సదాచార కార్యములు ఆచరించాలి, ***సచిత్త పరియోదపనం*** – మనసును పరిశుభ్రం చేస్తూ ఉండాలి. మనసును మొత్తంగా పరిశుభ్రం చేస్తూ ఉండాలి. అంతే. చాలా సరళము మరియు అదే సమయంలో చాలా లోతు, చాలా గంభీరము.

పైపైకి ఇది చాలా సరళముగా కనిపిస్తుంది. పేరున్న ఏ మతమైనా అంటుంది, "పాపకార్యముల నుండి దూరంగా ఉండాలి." ప్రతి మతము చెపుతుంది, "మంచి పనులు చెయ్యాలి." ప్రతిమతము చెపుతుంది. "నీ మనస్సును శుభ్రపరుచుకో", ప్రతి మతమూ ఇదే చెపుతుంది. మరి బుద్ధుని యొక్క ప్రత్యేకత ఏమిటి? మనం అర్థం చేసుకొందాం.

ధర్మోపదేశాలు ఇవ్వడమే పని అయితే, అప్పుడు బుద్ధుడు కూడా ఇతర మతబోధకులతో సమానంగా నిలబడతాడు. కాని బుద్ధుడు కేవలం ధర్మోపదేశాలు మాత్రమే ఇవ్వలేదు. ఆయన ధర్మజీవితం గడపటానికి దేనితోనైతే ఆ ధర్మోపదేశాలను నిజం చేయవచ్చో, అటువంటి ఒక మార్గమును, ఒక విద్యను, ఒక అభ్యాసమును ఆయన మనకు ఇచ్చారు.

సదాచార జీవనం గడపడం యేదో స్థాయిలో అందరూ ఒప్పుకొనేదే. "అవును నేను సదాచార జీవనం గడపవలసిందే! నేను దానిని ఒప్పుకొంటాను." బుద్ధుడు చెప్పాడనో లేక ఈ మతస్థాపకుడు చెప్పాడనో, లేక ఆ మతం చెప్తుతుందనో, ఒకరు భక్తిస్థాయిలో ఒప్పుకోవచ్చు. "నేను ఆ తెగవాడిని, ఆ మతం వాడిని, ఆ పరంపర వాడిని, కాబట్టి నేను సదాచార జీవనం గడపాలి". ఒకరు దీనిని భక్తిస్థాయిలో ఒప్పుకొంటారు. ఒకరు బుద్ధిస్థాయిలో ఒప్పుకుంటారు. "నేను నీతివంతమైన, మంచిపనులనే చేయాలి. నేను నా మనసును శుద్ధి చేసుకోవాలి."

కాని ఇది ఆచరణ స్థాయిలో, అనుభవస్థాయిలో అంగీకరించగలగటం చాలా కష్టం. అనుభవస్థాయి కొరవడుతుంది. మరియు అది కొరవడితే అంతా కొరవడినట్లే. బుద్ధత్వాన్ని పొందిన ఎవరైనా ధర్మము యొక్క అనుభవం చేసుకోగలిగిన విషయాన్నే బోధిస్తారు.

పాపకార్యములను చేయకండి. చేయకుండా ఎలా ఉండటం? మంచి పనులు చేయండి. మంచి పనులు చేయడం ఎలా? మనసును శుద్ధి చేసుకొనండి. మనసు మొత్తాన్ని పరిశుద్ధం చేసుకోవటం ఎలా? మానవ జాతికి బుద్ధుడు ఇచ్చిన అనుపమానమైన తోడ్పాటు ఇదే. మనసు మొత్తాన్ని పరిశుద్ధం చేసుకోవడాన్ని ఆయన కనుగొని, దారిచూపారు.

దీనిలోని మొదటి భాగము శీలము : పాపకార్యములు చేయకండి. పాప కార్యముల చేస్తే నరకానికి వెళతారని కొంతమంది మతాధికారులు ప్రజలకు చెపుతారు. పాపకార్యములు చేయకుండా ఉంటే స్వర్గానికి వెళతారు. అది నిజమే. చాలామందికి అది హాస్యాస్పదంగా ఉంటుంది. "తరువాతి జీవితం గురించి ఎవరు లక్ష్యపెడతారు? నరకమెక్కడుంది? స్వర్గమెక్కడుంది? నేను ఈ జీవితాన్ని ఆనందంగా అనుభవిస్తే చాలు. అదే నాకు మంచిది."

ఇంకొక వాదన ఉంది. మనిషి సంఘజీవి. సంఘంలో బ్రతకాలి, కుటుంబలోని సభ్యులతో కలిసి బ్రతకాలి. ఇతరులతో కలిసి బ్రతకాలి. ఒక సన్యాసి అయినా, ఒక భిక్షువు అయినా, ఒక భిక్షుణి అయినా సమాజములోని ఇతరులతో సంబంధాలను కలిగి ఉంటారు. సమాజములోని శాంతి సామరస్యములను భంగపరిచే పని ఎవరైన చేస్తే, అలాంటి వారు తమ లోపల శాంతి సామరస్యములను ఎలా పొందగలరు? బుద్ధిపరంగా మనం అర్థం చేసుకోవటం మొదలు పెడతాము, "నేను నా చుట్టూ మంటలను వెలిగిస్తే, ఆ మంటల వేడికి నేను కూడా బాధపడాలి. నా చుట్టూ ఉత్పత్తి

చేసిన వేడికి నేను కూడా బాధపడాలి."

మరొకవాదన కూడా ఉంది, సాధారణంగా ఇది పిల్లలకు చెపుతారు.

"నిన్నెవరైన చంపడానికో కొట్టటానికో వస్తే నువు దానిని ఇష్టపడతావా?"

"నేను దానిని ఇష్టపడను."

"అలాగైతే నువ్వు వేరొకరిని కొట్టినా చంపడానికి ప్రయత్నించినా, ఆ వ్యక్తి యిష్టపడదు కదా, అవునా?"

"ఆ వ్యక్తి యిష్టపడదు"

"ఇతరులు నీకు ఏది చేయడం నీవు యిష్టపడవో, అలాంటి వాటిని నీవు ఇతరులకు చేయకూడదు కదా!"

"అవును, నేను చంపకూడదు. మీరు చెప్పినది సరి అయినదే"

ఇదే విధంగా అన్ని నీతి సూత్రములకు ఇలాంటి వాదనలే చెపుతాము.

పంచశీలాలు తార్కిక స్థాయిలో, విచక్షణా స్థాయిలో మరియు మేధోస్థాయిలో చాలా అంగీకారంగానే ఉంటాయి. అయినప్పటికి ప్రజలు శీల సదాచార జీవనం గడుపరు. వారు ఇలా అర్థం చేసుకోవచ్చు. "నేను శీలవంతముగా జీవించాలి. శీలము నాకు చాలా ముఖ్యమైనది. శీలజీవనము నాకు చాలా మంచిది, ఇతరులకూ చాలామంచిది" అయిన్నపటికీ, వారు శీలవంతంగా జీవించరు. ఎందుకని? బుద్ధుడు దానిని సరిగా అర్థం చేసుకున్నాడు, ఎందుకంటే ఎవరికి వారికి తన మనసుమీద నియంత్రణ లేదు. తన మనసుకు తాను అధిపతికాదు.

త్రాగుబోతుకు బాగా తెలుసు, "నేను మద్యపానము చేయకూడదు, మద్యము నాకు మంచిది కాదు." అయినప్పటికి ఆ టైమ్ కాగానే దానికి వశమై లోబడి పోతాడు. తనను తాను నియంత్రించుకోలేడు. ఒక జూదగానికి బాగా తెలుసు, "నేను జూదము ఆడకూడదు, జూదము నాకు మంచిది కాదు." కాని సమయము రాగానే అతను జూదము ఆడతాడు. ఇవి మంచివికాదని బాగా అర్థం చేసుకొన్నప్పటికి కూడా చెడు పనులు చేస్తూనే ఉంటారు. తన మనసుమీద తనకు ఆధిపత్యము లేకపోవడమే దీనికి కారణము. తన అవినీతివంతమైన ప్రవర్తనా సరళికి తానే బానిస అవుతున్నాడు.

అందువలననే బుద్ధుడు ధర్మములోని రెండవ భాగమును బోధించాడు. సమాధి. మనసు మీద ఆధిపత్యము. బుద్ధుడు బోధించిన సమాధి ఇతరులు బోధించిన దానికంటే వేరైనది. ఆయన **సమ్మాసమాధి** (సమ్యక్ సమాధి)ని బోధించారు.

సరే, సమాధి అభ్యాసముచేసి, మనసు మీద ఆధిపత్యము సంపాదించారు అనుకొందాం. శీలవంతమైన జీవితం గడుపుతూ సమాజంలోని శాంతి సామరస్యములను భంగపరిచే దుష్కర్మలు చేయకుండా ఉన్నారు. సమాధిని వృద్ధి పరుచుకొన్నారు. కాని మనసు లోతులలో కనుక మలినాలు ఉన్నట్లయితే, ఏ అనుశయక్లేశము (మనసు లోతులలో అట్టడుగున నిద్రాణమై ఉన్న అగ్ని పర్వతముల లాంటి మలినములు) ఎప్పుడు ఎలా పైకి ఉబికి వస్తుందో ఎవరికీ తెలియదు. మాలిన్యములు తనని వశము చేసుకోవడం వల్ల, మనిషి దురాచార జీవితం ప్రారంభిస్తాడు.

బోధిసత్త్వ గౌతముడు దీనిని గ్రహించాడు. ఆయన ఎనిమిది ధ్యానాలను, లౌకీయ ధ్యానాలను - అభ్యాసం చేశాడు. ఈ ధ్యానములను చేసిన తరువాత కూడా మనసు లోలోతులలో ఉన్న మలినాలు నిర్మూలించబడలేదని ఆయన గ్రహించాడు. ఈ అట్టడుగు లోలోతులలో ఉన్న మలినాలు నిర్మూలనమైతే తప్ప ముక్తి లభించదు.

అందువలన ఆయన ధర్మములోని మూడవ భాగాన్ని సాధన చేసాడు. అది **పన్న** (ప్రజ్ఞ) అనగా జ్ఞానము, మనసును అట్టడుగు లోతు వరకు శుద్ధి చేయుట. వైవిధ్యభరితమైన భారతీయ ఆధ్యాత్మికత మనము కలిగి ఉన్నాము. గురువులందరూ చెప్పే విషయం ఒకటే. "రాగము నుండి బయటపడు, ద్వేషము నుండి బయటపడు, ఇంద్రియ విషయముల ఎడల రాగద్వేషముల లాలసత్వము వద్దు." అని. కాని లోతుగా వెళ్ళి పరిశీలిస్తే బుద్ధుడు మనకు ప్రసాదించినది అనుపమానమైనది అని మనకు తెలుస్తుంది. బుద్ధుడు వెళ్ళినంత లోతుగా ఏ ఇతర ఆచార్యుడు వెళ్ళలేదు. ఆయన చూపిన మార్గము అందరిని ఆ లోతుకు తీసుకొని వెళుతుంది.

(డిసెంబరు 2004 ఇంగ్లీషు విపశ్యనా పత్రికకు తెలుగు అనువాదము)

(ఇంకావుంది)

## "నిందాగుహ" (నీతి కథ)

**- శ్రీమతి పుష్పాసావలా**

పర్వత ప్రాంతంలోని ఒక వనంలో కోతులు గుంపులు గుంపులుగా నివసిస్తుండేవి. అందులోని ఒక గుంపుకు నాయకుడైన కోతి అత్యంత సుందరమైనది. దాని ఒంటిమీది జుట్టు పట్టుకన్నా మృదువుగా మిలమిలామెరిసిపోతూ ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ఆ కోతిరాజు ముఖము, రూపురేఖలు ఎంత అందంగా ఉండేవంటే చూసినవాళ్ళు ఏ స్వర్గదేవతో ఇలా కోతి రూపంలో జన్మించిందని అనుకునేవారు. బలమైన దాని ఒంటితీరు, ఠీవి చూపరుల దృష్టిని కట్టిపడేసేది.

ఒకనాడు సమీపంలోని నగరం నుండి కొందరు వేటగాళ్ళు ఆ వనానికి వచ్చారు. అసాధారణమైన కోతిరాజును చూసి వాళ్ళిలా అనుకున్నారు.

"ఇంత అందమైన కోతిని పట్టుకెళ్లి రాజుగారికి ఇస్తే, ఎంతో సంతోషించి మనకు పెద్ద బహుమానం ఇస్తాడు."

వేటగాళ్ళు వల విసిరారు, కోతిరాజును పట్టుకున్నారు, నగరం చేరుకుని రాజుకు ఇచ్చారు.

అపురూపమైన కోతిరాజు అందాన్ని చూసి రాజు ఆశ్చర్యచకితుడయ్యాడు. ఎంతో సంతోషించాడు. వేటగాళ్ళకు నూరు బంగారు నాణాలు బహుమతిగా ఇచ్చాడు. రాజమహల్లో కోతిరాజుకు నివాసం ఏర్పాటు చేయబడింది. రాజు ఒక నిపుణుడైన గారడీవాడిని దాని సేవకై నియమించాడు. చూపరులకు వినోదం కలిగించే పలురకాల సర్కస్ విద్యలను గారడీవాడు ఆ కోతిరాజుకు నేర్పించసాగాడు. అనతికాలంలోనే కోతిరాజు ఆ విద్యలన్నింటిలో ప్రావీణ్యత సంపాదించింది. ఎంత గొప్ప అందమున్నదో అంత గొప్ప తెలివి కూడా దానికున్నదని ఋజువయింది.

నగరములో గల వేదికపై ప్రజల వినోదము కొరకు గారడీవాడు రోజూ కోతిరాజుతో పలురకాల సర్కస్ ఫీట్లు చేయించేవాడు. వేల సంఖ్యలో ప్రజలు దాని కళానైపుణ్యమును చూసి ఆశ్చర్యంతో మంత్రముగ్ధులయ్యేవారు. దాని కీర్తి నలువైపులా వ్యాపించసాగింది. దూరదూర గ్రామముల నుండి, నగరముల నుండి ప్రజలు తండోపతండాలుగా వచ్చి కోతిరాజు చేసే విన్యాసములను తిలకించేవారు. రాజుకు ఈ విషయం తెలిసింది. అతని మనసులోనూ కుతూహలం కలిగింది. రాచకార్యముల నుండి తీరిక చేసుకొని ఒకరోజు కోతిరాజు విన్యాసములను చూసేందుకు వెళ్ళాడు. కోతిరాజు విన్యాసములు, అంగభంగిమలు, హావభావములు చూసి మంత్రముగ్ధుడయ్యాడు. రాజు మనసు సంతోషంతో నిండిపోయింది. కోతిరాజుతో అన్నాడు -

"కోతిరాజా! నిన్నూ నీ విన్యాసములనూ చూసి నాకెంతో సంతోషం కలిగింది. నీవంటి ప్రతిభాశాలిని బందీగా ఉంచడం భావ్యం కాదు. నీకు బంధవిముక్తి ప్రసాదిస్తున్నాను. వెళ్ళు, వనములోకి వెళ్ళి కుటుంబసభ్యులతో, పరిజనులతో కలిసి స్వేచ్ఛగా జీవించు".

ప్రజలకు కోతిరాజును విడిచి పెట్టడం ఇష్టం లేదు. కాని రాజు మాట ఇచ్చాడు; దాని పాలన చేయడం రాజధర్మము. కాబట్టి, కోతిరాజు తిరిగి వనమునకు చేరవేయబడ్డాడు.

తమ నాయకుడు క్షేమంగా తిరిగి రావడం చూసి కోతుల ఆనందానికి హద్దులు లేవు. సంతోషంతో అవి పండుగ జరుపుకున్నాయి. కోతిరాజు స్వాగత సత్కారముల కొరకు పర్వతములోని ఒక గుహలో పెద్ద సభ ఏర్పాటు చేశాయి. కోతులన్నీ తమ రాజును రకరకాల ఫలపుష్పములతో సత్కరించాయి. ఆ పిమ్మట నగరము గురించీ, నగరవాసుల గురించీ తెలుసుకోవాలనే తమ కోరికను వెలిబుచ్చాయి.

కోతిరాజు అన్నాడు "అరే, నగరవాసుల సంగతి ఇప్పుడెందుకు? వాళ్ళ గురించి మాట్లాడటం నాకిష్టం లేదు. నన్ను వదిలేయండి."

కాని కోతులన్నీ పట్టుబట్టాయి – "అయ్యా, వాళ్ళ గురించి మాకు కొంచెమైనా తెలియజేయండి". అంటూ కోతిరాజును బతిమాలాయి.

నిందించడం తనకు ఇష్టం కాకపోయినా, అందరి బలవంతమును కాదనలేక కోతిరాజు చెప్పసాగాడు.

"సరే వినండి, నగరవాసుల గురించి చెబుతాను. మనుష్యుల సమాజం చాలా విచిత్రంగా ఉంది. మనమందరము చెట్లకొమ్మలపై కలిసి ఉన్నట్లు వాళ్ళుండరు. వారిలో ఐకమత్యము లేదు. చిన్న చిన్న ఇళ్ళు కట్టుకొని విడివడిగా ఉంటారు. ఒకే ఇంటి వ్యక్తులు కూడా అందరూ ఒకేలా ఉండరు. ఒకరికి మీసాలుంటాయి, మరొకరికి ఉండవు. ఒకరి చెవికి రంధ్రముంటుంది, మరొకరికి ఉండదు. ఒకరి జుట్టు చిన్నగా ఉంటుంది, మరొకరి జుట్టు పొడుగ్గా ఉంటుంది".

ఇది విని "ఛీ, ఛీ, ఛీ, ఎంత పనికిమాలినవాళ్ళు. ఇలాంటి వాళ్ళు మా కంటికి కనిపించరాదు" అంటూ కోతులన్నీ తమ చేతులను కళ్ళమీద పెట్టుకున్నాయి.

"ఇంకా వినండి తమ్ముళ్ళూ" అంటూ కోతిరాజు మనుష్య ప్రాణుల విచిత్రములను మరిన్ని ఏకరువు పెట్టాడు.

"ఇతను బ్రాహ్మణుడు, ఇతను క్షత్రియుడు, ఇతను శూద్రుడు – ఇలా మానవులు తమ సమాజములో ఎన్ని భేదములను తయారు చేసుకున్నారో చెప్పనలవికాదు. ధర్మము గురించి మాటలు మాత్రం పెద్దపెద్దవి చెబుతుంటారు. కాని ఒకడు ఉన్నతుడు, ఒకడు నీచుడు అని అనుకుంటూ పరస్పరం పోట్లాడుకుంటారు. ఈ ఇల్లు నాది, ఆ ఇల్లు నీది; ఈ పొలం నాది, ఆ పొలం నీది; ఈ ఆస్తినాది, ఆ ఆస్తి నీది – ఇలా నాదీ నీదీ అనుకుంటూ ఎప్పుడూ గొడవపడుతూనే ఉంటారు".

"చాలు, చాలు, విన్నది చాలు. ఇలాంటి అధర్మం మాటలు ఇంకా వినకూడదు' ' – అంటూ కోతులన్నీ తమ చెవులమీద చేతులు పెట్టుకున్నాయి.

ఇంతలో తెలివిగల ఒక ముసలికోతి అన్నది–

"అరే! ఈ గుహలో కూర్చుని మనం మనుష్యప్రాణులను ఎంతో నిందించాము".

అదివిని రెండవకోతి అన్నది – "అవును. నిందించడం మహాపాపం అన్న విషయం మరచే పోయాము సుమా!"

మూడవకోతి – "నిందించడము వల్ల మనసు మలినమవుతుంది".

నాలుగవకోతి – "మలినమైన మనసు దుఃఖానికి గురవుతుంది".

ఈ మాటలు విని కోతులన్నీ మళ్ళీ ఎప్పుడూ నిందించేపని చేయరాదని నిర్ణయించుకుని తమ నోళ్ళపై చేతులు పెట్టుకున్నాయి.

ఎక్కడైతే తామంతా కూర్చుని నిందించే చెడు కార్యాన్ని చేశారో దానిని అపవిత్ర స్థలంగా భావించి కోతులన్నీ గబగబా గెంతుతూ ఆ గుహనుండి బయటకు వెళ్ళిపోయాయి.

ఆనాటి నుండి ఆ గుహ "నిందాగుహ"గా పిలువబడింది. కోతులు అక్కడికి వెళ్ళడం మానేశాయి.

(విపశ్యన హిందీ మాసపత్రిక 23 డిసెంబరు 1988 నుండి)

**సంవత్సర చందా రూ. 50/- , 5 సంవత్సరముల చందా రూ. 200/- ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**

**విపశ్యన తెలుగు మాసపత్రిక,**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070. ఫోన్ : 24240290 (ఆశ్రమం).**

***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

Postal Reg. HSE 864/2007-2009 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

TO

If Undelivered please return to:
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6 KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P) -70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam. Editor : Sri O. Premanand. Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979.